

నేటి నుంచి కులగణన

కలెక్టరేట్, జనవరి 18: జిల్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 28 వరకు కుల గణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియలో సచివాలయ సిబ్బంది పాల్గొని.. వారి పరిధిలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఈ గణనలో నమోదు కాని వారు ఈ నెల 29నుంచి ఫిబ్రవరి 2 వరకు సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రీ వెరిఫికేషన్ చేసి, గణన వివరాలను ఫిబ్రవరి 15వరకు సరిపోల్చి చూస్తామని తెలిపారు.



ఆమదాలవలసలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కూన రవికుమార్, టీడీపీ నేతలు, కార్యకర్తలు

ఎన్టీఆర్.. చిరస్మరణీయుడు

- వాడవాడలా వర్ధంతి
- విగ్రహాలకు ఘన నివాళి
- పుస్తకావిష్కరణ, రక్తదాన శిబిరాల నిర్వహణ

ఆమదాలవలస, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని వాడవాడలా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పుస్తకావిష్కరణలు చేపట్టి.. రక్తదాన శిబిరాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం ఆమదాలవలసలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. అనంతరం ఆమదాలవలసలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కూన రవికుమార్‌తో పాటు నియోజకవర్గంలో 259 మంది కార్యకర్తలు, నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు ఆనెపు రామకృష్ణ, నూకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, చిగులపల్లి రామ్మోహన్, ఆన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, బోసెల అప్పారావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రక్తదానం చేసిన కొద్దిసేపటి తర్వాత కూన రవికుమార్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను వెంటనే కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆయన ఇంటికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే అశోక్ రక్తదానం

కవిటి: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కవిటి ప్రభుత్వాసుపత్రిలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు టీడీపీ నేతలు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందజేశారు.





చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరికలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో శ్రీకాకుళం నగరానికి చెందిన పలువురు ఆ పార్టీలో చేరారు. గురువారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శివప్రియ అధినేత రెడ్డి చిరంజీవులు, ఆయన కుమారులు శివన్నారాయణ, రామకృష్ణంనాయుడుతో మరో ఇరవై మంది టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నతో కలిసి చంద్రబాబునాయుడు వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని చంద్రబాబు వారికి సూచించారు.

- శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ అరసవల్లి

పలాసలో 220 యూనిట్ల రక్తం సేకరణ

పలాస: పలాసలోని టీడీపీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన లెజెండరీ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొని 220 యూనిట్ల రక్తాన్ని దానం చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ప్రకటించారు. రక్తదాతలను ఆమె అభినందించారు. వారికి గుర్తింపు పత్రాలతో పాటు మెడల్స్ అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ వైద్యులు, సిబ్బంది బృందం రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు యార్లగడ్డ వెంకన్నచౌదిరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, శాసనపురి మురళీకృష్ణ, దువ్వాడ హేమబాబు చౌదిరి, దువ్వాడ శ్రీహర్ష, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కొత్తకోట తిరుమలరావు, వీఎల్ఎస్.రాజు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న గౌతు శిరీష

సినీ, రాజకీయ జీవితంపై పుస్తకావిష్కరణ

అరసవల్లి : తెలుగువారి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసి, కీర్తి పతాకగా నిలిచిన వ్యక్తి అన్న స్వర్గీయ నందమూరి తారకరామారావు అని టీడీపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. గురువారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సినీరంగంలోను, రాజకీయ రంగంలోను తనదైన ముద్రను వేసిన గొప్పవ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రపై ఎన్ని పుస్తకాలు రాసినా చాలవని, ఆయన జీవితం సమాజానికి ఒక ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో అరవల మోహనరావు, అంబటి లక్ష్మీరాజ్యం, పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమలరావు, రెడ్డి శంకర్, మూకళ్ల శ్రీను, గుండ భాస్కర్, గొండు వెంకటరమణమూర్తి, బుర్రి మధు, బొల్లా నాగేంద్రయాదవ్, సరవపిల్లి గోవిందరావు, రెడ్డి సూర్యనారాయణ, భైరి నరేష్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జీవితంపై పుస్తకావిష్కరణ చేస్తున్న గొండు శంకర్



మాట్లాడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలకుడు శ్యామలరావు

22న ఓటర్ల తుది జాబితా విడుదల

- ప్రత్యేక పరిశీలకుడు శ్యామలరావు

కలెక్టరేట్, జనవరి 18: ఈ నెల 22న ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తున్నట్టు జిల్లా ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలకుడు జె.శ్యామలరావు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఇన్ చార్జి కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా అందరూ పరిశీలించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందరికీ ఎపిక్ కార్డులు అందజేయాలన్నారు. వివిధ రాజకీయపార్టీల నుంచి అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఆయా పతినిధులకు తెలియపరచాలని సూచించారు. తొలగింపులు, చేర్పులపై ఎవరైనా బల్క్‌గా దరఖాస్తులు సమర్పిస్తే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే త్వరితగతిన చేపట్టాలని, మండలాల్లో సమస్యలుంటే ఆర్డీవోల ద్వారా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవోలు భరత్‌నాయక్, రంగయ్య, ఉప కలెక్టర్లు జయదేవి, పద్మావతి, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

బీఆర్ఏయూ వీసీగా ప్రొఫెసర్ రజని బాధ్యతల స్వీకరణ



ఎచ్చెర్ల, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ కేఆర్ రజని గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి, వర్సిటీ అధికారిక చిహ్నానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ వర్సిటీకి వీసీగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేసి.. వర్సిటీని ప్రగతిపథంలో నడిపిస్తానని తెలిపారు. బోధనా, బోధనేతర సిబ్బంది అంకితభావంతో పనిచేసి వర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత, వర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడడం విచారకరం

- షోకాజ్ నోటీసులకు సమాధానమిచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు



అధికారులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

అరసవల్లి, జనవరి 18: ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీ కార్యకర్తలు సమాధానమిచ్చారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం గుజరాతీపేట నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి ఆధ్వర్యంలో అధికారులకు సమాధానం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరగా.. ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం విచారకరమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఆర్.ప్రకాష్, ఎస్.చిట్టితల్లి, కె.జ్యోతి, వాణి, వై.లీలారత్నం, కె.పార్వతి, బి.సూర్య కుమారి, బి.మల్లీశ్వరి పాల్గొన్నారు.



రద్దీగా రైల్వేస్టేషన్

పెద్దపండగ సందడిగా ముగిసింది. సంక్రాంతిని పురస్కరించుకుని.. వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగుపయనమవుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. టిక్కెట్ కౌంటర్ల వద్ద బారులుదీరారు. రిజర్వేషన్లు, జనరల్ బోగీలు కిటకిటలాడాయి. రద్దీ నేపథ్యంలో కొంతమంది ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించారు.

- ఇచ్ఛాపురం

- ఈ నెల 3న రణస్థలం మండలం పతివాడపాలెం సమీపంలో పతివాడ లక్ష్మీ మెడలో రెండున్నర తులాల బంగారు గొలుసును ఇద్దరు యువకులు తెంచుకుపోయారు. ఆమె పొలం పనులు ముగించుకుని ఇంటికెళ్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై అటకాయించి.. గొలుసును తెంపుకొని పోయారు.
- ఈ నెల 10న అరసవల్లిలో జేబు దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూజారి శ్రీను అనే యువకుడు దేవస్థానానికి వచ్చే భక్తులు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులను టార్గెట్ చేసుకొని జేబులు కొట్టేసేవాడు. నగదుతో పాటు సెల్‌ఫోన్ల చోరీ చేసేవాడు. పోలీసులు మాటువేసి శ్రీనును అదుపులోకి తీసుకున్నారు.
- ఈ నెల 10న హిరమండలం సుబలాయి జంక్షన్‌లో కర్రి అమ్మన్న అనే వృద్ధురాలి మెడలో ఆరున్నర తులాల బంగారు ఆభరణాన్ని ఇద్దరు యువకులు తెంపుకొని పోయారు. బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలు అనారోగ్యంతో అపస్మారక స్థితికి చేరుకుంది. సపర్యలు చేస్తున్నట్టు నటిస్తూ ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దొంగిలించారు. చివరకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో ఇద్దరూ దొరికిపోయారు.



దొంగ.. దొంగా!

- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- పోలీసుశాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- రాత్రివేళల్లో తగ్గిన నిఘా

(రణస్థలం)

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలనే టార్గెట్ చేసుకొని బీభత్సం సృష్టిస్తున్నారు. ఇళ్లు, షాపులు, వాణిజ్య సముదాయాలు, చివరకు పొలాల్లో ఉన్న మోటార్లు, ఇంజన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం చోరీ చేస్తున్నారు. జిల్లాలో రోజూ ఏదో మూలన దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. నిఘా పటిష్టంతో పాటు గస్తీ ముమ్మరం చేసినట్టు పోలీసులు చెబుతున్నా.. దొంగతనాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్ లాకింగ్ సిస్టంపై ప్రజల్లో అవగాహన కరువవుతోంది. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు విచారణలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి చూపడం లేదు. జిల్లా మీదుగా నేషనల్ హైవే, అంతర్ రాష్ట్ర రహదారులు, రైలు మార్గం ఉండడం దొంగతనాల పెరుగుదలకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఒడిశాతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముఠాలు జిల్లాలో ప్రవేశించాయన్న హెచ్చరికలు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రిపూట వాహన తనిఖీలు, గస్తీలను ముమ్మరం చేశారు. మరోవైపు జిల్లాలో హత్యలు, బలవన్మరణాలు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి తగదాలు పెరుగుతున్నాయి. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 994 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పోలీసు శాఖ చెబుతోంది. ఇందులో చాలావరకు పనిచేయడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈక్రమంలో దొంగతనాలు పెరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

అరకొర సిబ్బంది

పోలీస్ శాఖకు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో స్టేషన్‌కు సగటున 32 మందికిపైగా సిబ్బంది ఉండాల్సి ఉండగా.. అందులో సగం మంది కూడా లేరు. ఉమ్మడి జిల్లాలో 42 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు సీసీఎస్, మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు కొనసాగుతున్నాయి. బీ గ్రేడ్ స్థాయిలో కొనసాగుతున్న శ్రీకాకుళం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సైతం అరకొరగానే సిబ్బంది ఉన్నారు. సీ గ్రేడ్‌లో ఉన్న కాశీబుగ్గ, రాజాం, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్లలోనూ అదే పరిస్థితి. సిబ్బంది కొరత కారణంగా నైట్ బీట్ కూడా తగ్గుముఖం పట్టింది. ప్రధాన రహదారుల్లో సైరన్‌తో చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. శ్రీకాకుళం, పాలకొండ, కాశీబుగ్గ సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎస్పీతో పాటు ముగ్గురు ఏఎస్పీలు, 13 మంది డీఎస్పీలు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 12 సర్కిళ్లకుగాను 22 మంది సీఐలు, 120 మంది ఎస్ఐలు, 138 మంది ఏఎస్ఐలు, 365 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 1,200 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. 850 మంది హోంగార్డులు సేవలందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14,000 మంది కానిస్టేబుళ్ల కొరత ఉన్నట్టు పోలీస్ యంత్రాంగం చెబుతోంది. జిల్లాలో 1,000 మంది కానిస్టేబుళ్లను నియమిస్తే కానీ అన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత తీరదని అధికారులు చెబుతున్నారు.

ఇంటర్ లాకింగ్‌ను వినియోగించుకోవాలి

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇళ్లకు తాళాలు వేసి క్యాంపులు వెళ్లిన వారు విధిగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలి. ఇంటర్ లాకింగ్ సిస్టంను ఆశ్రయించాలి. దొంగతనం నియంత్రణకు అదో చక్కటి సాధనం. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-జి.రామచంద్రరావు, సీఐ, జే.ఆర్.పురం



బండి కనిపిస్తే.. అంతే!

- జంట పట్టణాల్లో బైక్ చోరీలు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు

(కాశీబుగ్గ)

- గత ఏడాది ఆగస్టు 15న కాశీబుగ్గ నెహ్రూనగర్‌కు చెందిన గజరావు రవికుమార్‌కు చెందిన హోండా షైన్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు.
- గత ఏడాది అక్టోబరు 13న కాశీబుగ్గ భగవతి థియేటర్ వద్ద టి.వంశీకి చెందిన పల్సర్ బైక్ చోరీకి గురైంది.
- గత ఏడాది డిసెంబరు 1న కాశీబుగ్గ గాంధీనగర్ రామకృష్ణ మార్గ్‌లో దున్న రమేష్‌కు చెందిన పల్సర్ బైక్‌ను ఆగంతకులు ఎత్తుకుపోయారు.
- గత ఏడాది డిసెంబరు 26న మందస మండలం హరిపురంలో నల్ల నరేష్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది.
- ఈనెల 5న కాశీబుగ్గ గాంధీనగర్‌కు చెందిన పొట్నూరు శ్రీధర్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఎవరో దొంగిలించారు.
- ఈ నెల 7న పలాస కొత్త వీధికి చెందిన టి.శ్రీనివాసరావుకు చెందిన టీవీఎస్ అపాచీ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఇంటి బయట పార్కింగ్ చేసిన వాహనం.. ఉదయం లేచి చూడగా కనిపించకపోవడంతో శ్రీనివాసరావు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

పలాస నియోజకవర్గంలో వరుసగా బైక్‌లు చోరీకి గురవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి దగ్గర పార్కింగ్ చేసిన వాహనాలు తెల్లారి లేచి చూసేసరికి కనపడకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దొంగలు ఖరీదైన వాహనాలపైనే దృష్టి పెడుతున్నారు. సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్లు, అపాచీలు ఎక్కువగా దొంగిలిస్తున్నారు. రంగులు, నెంబరు ప్లేట్లు మార్చి వీటిని ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది విడి పరికరాలను విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో బాధితులు నిట్టూరుస్తున్నారు. నిందితులను పట్టుకోవడం లేదా.. వాహనాలు రికవరీ చేయడం లేదని వాపోతున్నారు. సీసీ కెమెరాలు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో నేరాలు, చోరీలు పెరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు రాత్రి గస్తీ కూడా ప్రధాన జంక్షన్లు, రహదారులకే పరిమితమవుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

ఇది ఎవరి పని?

ద్విచక్ర వాహనాల దొంగతనం.. అంతర్ రాష్ట్ర ముఠాల పనేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో స్థానిక యువత పాత్ర సైతం ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఇటీవల జిల్లాలో గంజాయి పెద్దఎత్తున పట్టుబడుతోంది. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు. పార్టీ కల్చర్ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వారే చోరీలకు తెగబడుతున్నట్టు అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికైనా చోరీల నియంత్రణపై పోలీస్ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

దర్యాప్తు చేస్తున్నాం

ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై దర్యాప్తు చేస్తున్నాం. విచారణకు ప్రత్యేకంగా ఏడు గస్తీ బృందాలను నియమించాం. వాహనదారులు సైతం జాగ్రత్తలు తీసుకోవాలి. త్వరలో నిందితులను పట్టుకుని.. వాహనాలు రికవరీ చేస్తాం.

-సీఐ నవీన్‌కుమార్, కాశీబుగ్గ


నరసన్నపేట: మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి


పాతపట్నం: మాట్లాడుతున్న కలమట వెంకట రమణమూర్తి


సారవకోట మండలం చీడిపూడిలో గ్యారెంటీ కరపత్రాన్ని అందజేస్తున్న వెంకటరమణ

వైసీపీ హయాంలో బీసీలపై దాడులు

● టీడీపీ నాయకుల ధ్వజం

వైసీపీహయాంలో బీసీలపై దాడులు జరగడంపై టీడీపీనాయకులు ధ్వజమెత్తారు. గురువారం పాతపట్నం, నరసన్నపేటలో జయహో బీసీ కార్యక్రమం, సారవకోట మండలం చీడిపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీతో ప్రగతి సాధ్యం

నరసన్నపేట: బీసీ ప్రగతి టీడీపీతోనే సాధ్యమని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేటలోని ఆదివారంపేటలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ స్ఫూర్తితో సైకో, దుష్ట పాలనను గద్దెదించాలన్నారు.బాబుగ్యారెంటీ -భవిష్యత్తుకు ష్యూరిటీ కార్యక్రమం గ్రామాల్లో వేగవంతం చేయాలన్నారు. ఈనెల 28న టెక్కలిలో నారా చంద్రబాబునాయుడు బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి వందలాది మంది టీడీపీ సానుభూతిపరులను తరలించాలన్నారు. రా.. తెలుగుదేశం పిలుస్తోంది కదిలిరా ..కార్యక్రమంతో వైసీపీ నాయకులు గుండెల్లో రైలు పరుగులు పెట్టించాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ బీసీవిభాగ రాష్ట్ర నాయకులు ధర్మాన తేజేశ్వరరావు, శిమ్మ చంద్రశేఖర్, వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరివెంకట రమణ, ఎం.వెంకటప్పలనాయుడు, గొండు రామన్న, జల్లు చంద్రమౌళి, గొద్దు చిట్టిబాబు, బెవర రాము, కింజరాపు రామారావు, పూతి రమణ, బైరి భాస్కరరావు, గొండు స్వామిబాబు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం

పాతపట్నం: వైసీపీ పాలనలో బీసీలకు నిరాదరణే మిగిలిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. పాతపట్నంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కక్షపూరిత రాజకీయాలతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ అధికారంలో కొచ్చిన వెంటనే బీసీలకు రక్షణచట్టం అమలులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి కలమట సాగర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఎల్ఎల్‌నాయుడు, సీమరామకృష్ణ, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు ,ఎల్ఎన్‌పేట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతం పలకాలి

జలుమూరు (సారవకోట): రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలకాలని టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. సారవకోట మండలంలోని చీడిపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. పథకాల పేరుతో వైసీపీనాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దనరావు, కింజరాపు రామారావు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ కార్యకర్తల చేరిక


వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శిరీష

పలాస: మందస మండలంలోని తాళ్లగురంటి పంచాయతీ పరిధిలోగల చిన్నకోష్ట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలాస టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కట్టా దుర్యోధన, బుయా మనోజ్‌కుమార్, సరవ కేశవరావు, సరవ రణజీత్‌తో పాటు మరికొందరు నాయకులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భావన దుర్యోధన, జీకేనాయుడు, రట్టి లింగరాజు, ఈశ్వరరావు, లక్ష్మణరావు, అప్పారావు, రఘు, హరికృష్ణ, డొంబురు, చౌహాన్, సుభాష్ పాల్గొన్నారు.

బైరాగి కుటుంబానికి పరామర్శ

వజ్రపుకొత్తూరు: చినమురహరిపురంలో కుత్తుం బైరాగి ఇటీవల మృతి చెందడంతో కుటుంబసభ్యులను టీడీపీరాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతుశిరీష గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో బైరాగి సేవలను కొనియాడారు, కార్యక్రమంలో టీడీపీనాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, వసంతరావు పాల్గొన్నారు.

జీపీడీపీపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

టెక్కలి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) 2024-25 తయారీపై గురువారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణకార్యక్రమం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీభాయ్,సూపరింటెండెంట్ రమణమూర్తి పాల్గొన్నారు.

●**ఎల్.ఎన్.పేట:** ప్రజలకు అవసరమైన అభివృద్ధిపనులు చేసేందుకు ప్రణాళికల తయారీలో సర్పంచ్‌తోపాటు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ సిబ్బందికి ప్రణాళికా తయారీపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, ఎంఈఓ కె. చంద్రమౌళి పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లకు అధికారులు సహకరించాలని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి కోరారు. వజ్రపుకొత్తూరులో సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తిరుమల రావు, వైస్ ఎంపీపీ రాజు పాల్గొన్నారు.

●**నందిగాం:** స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రెండురోజులుగా నిర్వహించిన జీపీడీపీ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. తొలిరోజు ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు, రెండోరోజు గురువారం సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్లు కె.సంతోష్‌కుమార్, సీహెచ్. ఢిల్లేశ్వరరావులు ప్రణాళికా అంశాలపై అవగాహన కల్పించారు.

●**జలుమూరు:** జలుమూరులోజీపీడీపీపై శిక్షణ తరగతులు నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, ఎంపీడీవో ఎ.దామోదరరావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీలో అగ్నిప్రమాదం.. త్రుటిలో తప్పిన ముప్పు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలాస/రూరల్: స్థానిక జాతీయరహదారి లక్ష్మీపురంటోల్‌ప్లాజా వద్ద గురువారం ఐరన్ తీగలతో వెళ్తున్న ఓ లారీలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు గుర్తించి కాశీబుగ్గ అగ్నిమాపకసిబ్బందికి సమాచారం అందించడంతో వారు సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఐరన్ లోడుతో వెళ్తున్న లారీలో బ్రేక్ వద్ద పొగలు వస్తున్న విషయాన్ని సంబంధిత డ్రైవర్ గుర్తించి లారీని రోడ్డు పక్కన నిలిపివేశారు. అనంతరం మంటలు రావడంతో లారీ దిగి దగ్గరలో ఉన్న హైవే, అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. లేకుంటే లారీ మొత్తం దగ్ధమయ్యేది. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో లింగవివక్ష, స్త్రీలపై లైంగిక వేధింపులకు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్‌జడ్జి జె.శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు నిర్వాసితులకు పట్టాల పంపిణీ

పలాస రూరల్: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఫ్లైఓవర్ నిర్మాణంలో ఇళ్లు, షాపులను కోల్పోయిన 128మంది నిర్వాసితులకు శనివారం తమ కార్యాలయంలో పట్టాలు పంపిణీచేయనున్నట్లు తహసీల్దార్ ఎల్.మధుసూధనరావు ఒకప్రకటనలో తెలిపారు.ఫ్లైఓవర్ నిర్వాసితులకు వేరే చోట స్థలాలను కేటాయించామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

● ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద నిరసనలు ● షోకాజ్ నోటీసులపై అధికారులకు వివరణ పత్రాలు ● 38వ రోజూ నిరసనలు

తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ స్పష్టంచేసింది. గురువారం సమ్మె 38వ రోజుకు చేరగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. కాగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇటీవల కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు.అనంతరం షోకాజ్ నోటీసులకు వివరణ పత్రాలను అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీనే అమలుచేయాలని కోరుతుండగా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం విచారకరమని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దుచేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


కోటబొమ్మాళి: ఐసీడీఎస్ పీవో చింతాడ హైమావతికి వివరణ ప్రతం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


సారవకోటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


నరసన్నపేట: ఐసీడీఎస్ అధికారులకు పత్రాలను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గార: కొల్లివలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద..


సరుబుజ్జిలి:షోకాజ్ నోటీసుపై వివరణపత్రం ఇస్తున్న కార్యకర్తలు


మందస: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో..


ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పలాసరూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


టెక్కలి: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఐసీడీఎస్ కార్యాలయ గోడలకు నోటీసులు

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీలు గురువారం బస్టాండ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి పోస్ట్‌మెన్ వచ్చి నోటీసులిచ్చే ప్రయత్నం చేయగా వారు తిరస్కరించారు. దీంతో వాటిని పోస్ట్‌మెన్ ఐసీడీఎస్ కార్యాలయానికి అప్పగించడంతో పీవో నాగరత్నం సిబ్బంది, సచివాలయ సిబ్బందితో పట్టణంలోని అంగన్‌వాడీసెంటర్ల గోడలకు నోటీసులు అతికించారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అధికారులు ఇచ్చిన నోటీస్ పత్రాలను జిరాక్స్ తీసి బెల్లుపడ కాలనీలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద గోడకు అతికించారు. వీటిని అతికించనీయకుండా పీవో అడ్డుకునే ప్రయత్నం చేయగా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సమయంలో యూనియన్ నాయకులతో పీవోతో వాగ్వాదం చేశారు. ఓ బుక్‌లో పైన ఖాళీగా ఉంచి కింద అంగన్‌వాడీల పేర్లు రాసి సంతకాలు చేయాలని పీవో కోరారు. దీంతో యూనియన్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పైన మేటర్ రాస్తేనే సంతకాలు చేస్తారని చెప్పి సంతకాలు పెట్టకుండా అంగన్‌వాడీలు వెళ్లిపోయారు. అధికారులిచ్చిన నోటీసులకు సమాధానంగా తిరిగి నోటీస్ గోడకు అతికించారు.

వ్యాపారులతో వాగ్వాదం

సంక్రాంతి పురస్కరించుకుని అంగన్‌వాడీలు టెంట్లు తీసేవారు. ఇక్కడ 37 రోజులుగా ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్‌లో శిబిరం ఏర్పాటుచేసి నిరసన తెలుపుతున్న విషయంవిదితమే. తిరిగి గురువారం టెంట్లు ఏర్పాటుచేయడంతో బస్టాండ్ కళాసీలు, ఇక్కడ వ్యాపారులు అడ్డుకున్నారు. వ్యాపారాలకు ఆటంకం కలుగుతోందని, టెంటు వేయవద్దని కోరారు. దీంతో అంగన్‌వాడీ సంఘ నాయకురాలకు వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను ఎస్ఐ గోవిందరావుకు వివరించారు. ఎవరికీ ఇబ్బందిలేకుండా సమ్మె,వ్యాపారాలు చేసుకోవాలనిచెప్పి ఎస్ఐ పంపించారు.

జిల్లాలో బెంతు ఒరియాలు లేరు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి


మాట్లాడుతున్న వాబ యోగి

జలుమూరు (సారవకోట): శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలు లేరని నివేదికలో పేర్కొన్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తెలిపారు. ఇక్కడ బెంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వారంతా నకిలీ బెంతుఒరియాలనిచెప్పారు. గురువారం సారవకోటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవిటిలో బెంతుఒరియా సర్టిఫికెట్లకోసం దీక్షలు చేసున్న వారంతా వడ్డి కులస్తులన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన టీసీఆర్అండ్‌టీఐ కమిటీ అధ్యయనం చేసి వీరికి బీసీ-ఏ సర్టిఫికెట్లు మంజూరుచేయాలని తేల్చి చెప్పిందన్నారు. బెంతుఒరియాలు కారని వడ్డి కులస్థులని నివేదికలో తేల్చి చెప్పారన్నారు. బెంతు ఒరియాలుగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలశాఖ ఉపాధ్యక్షుడు బెజ్జి కృష్ణ, కోఆర్డినేటర్ జన్ని అనిరుద్రుడు, జన్ని దాలయ్య, కొంకాడ మన్మథరావు, ఎస్.లక్ష్మణ్, జన్ని నీలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పలాస: స్థానిక ప్రభుత్వోన్నతపాఠశాలలో 1993-94 పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, గురువులకు సన్మానాలతో ఆనందంగా గడిపారు. తొలుత కుటుంబాలను పరిచయం చేసుకున్న తర్వాత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పీవీ సతీష్‌కుమార్, బోర కృష్ణారావు, మల్లా యుగంధర్, పట్నాన రవికాంత్, పెంట రమేష్, వైకుంఠరావు, మల్లా ప్రశాంతి, మార్పు సుజాత పాల్గొన్నారు.


పలాసలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

'సేవాదృక్పథంతో పనిచేయాలి'

టెక్కలి: స్వచ్ఛంద సంస్థలు సేవాదృక్పథంతో పనిచేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు తెలిపారు. గురువారం టెక్కలిలో తథాగత సంగమిత్ర చారిటబుల్ ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం పురస్కరించుకుని సిద్ధార్థనగర్, లుంబినీప్రాంగణంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పి.చంద్రిక, చీపురు కృష్ణ, దుంప శ్రీనివాస్, వెంకట్రావు, చంద్రశేఖర్, సోమశేఖర్, శ్రీనివాస్, సూర్యుడమ్మ, లక్ష్మి, పద్మ, మల్లిక పాల్గొన్నారు.

కరకవలసలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలసలో గురువారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సర్పంచ్ జి.యోగీశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కె.తవుడు, సీహెచ్ రామశంకరరావు, బి.రాముడు, టి.శోభన్‌బాబు, సిమ్మయ్య పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన తర్లాకోట రోడ్డు


పలాస నుంచి తర్లాకోట వెళ్లేదారిలో పనులు నిలిచిపోయిన దృశ్యం

పలాస రూరల్: మండలంలోని తర్లాకోట ప్రధాన రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయింది. గ్రామం నుంచి సగం వరకూ వేసి మిగతా భాగంగా పనులు నిలిచిపోయాయి. పలాస నుంచి తర్లాకోటకు వెళ్లే రహదారిలో ముందుగా మట్టిరోడ్డు కొంత వరకూ ఉండగా, గ్రామం మధ్య నుంచి శివారు వరకూ సీసీరోడ్డును వేశారు. అయితే సగం రోడ్డును విడిచిపెట్టడంతో పాదచారులు,వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా విడిచిపెట్టిన రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తిరుగు ప్రయాణాలతో రైళ్ల రద్దీ


మందస రైల్వేస్టేషన్‌లో మూటలతో రైలెక్కుతున్న వలస జీవులు

మందస: సంక్రాంతి ముగియడంతోగ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణాలు చేపడుతుండడంతో రైళ్లన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. మందస రైల్వే స్టేషన్‌లో గురువారం ఆగిన ప్రతి రైలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. కుటుంబాలతో సహా మూటాముళ్లే పట్టుకుని గమ్యస్థానాలకు చేరుకోవడానికి రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు. కార్యాలయాలు ప్రారంభంకావడంతో శుక్రవారానికి చేరుకోవా లన్న ఆతృతతో ప్యాసింజరు రైళ్లు సైతం ఎక్కారు. రైళ్లు రద్దీగా ఉండడంతో వేరే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొందరు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

సస్యరక్షణతోనే కొబ్బరికి మేలు

కవిటి: కొబ్బరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటేనే మేలు జరుగుతుందని ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుజాత తెలిపారు. గురువారం మండలంలోని బైరిపురం, శిలగాంల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు తీసుకుంటున్న చర్యలపై తెలుసుకున్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు డైరెక్టర్ కుమార్ వేలు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌బీ ప్రసాద్, మాధవీలత, చికాప్ ఛైర్మన్ జోహార్‌ఖాన్ పాల్గొన్నారు.


శిలగాంలో తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు



అరసవల్లి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు





నరసన్నపేట/పాతపట్నం: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బగ్గు, కలమట



ఇచ్ఛాపురం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎన్టీఆర్‌తోనే బడుగులకు రాజ్యాధికారం

- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

అరసవల్లి: ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరునామాగా నిలిచి, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన మహనీయుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కార్యదర్శి చిట్టి నాగభూషణం, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, నాయకులు జామి భీమశంకరరావు, ముద్దాడ కృష్ణమూర్తి, చిట్టి మోహన్, పట్నాల పార్వతీశం, గార మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, సీర రమణ, కేశవ రాంబాబు, బొనిగి భాస్కరరావు, విభూది సూరిబాబు, కొమనాపల్లి వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.



ఎచ్చెర్ల: రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత కిమిడి రామ్మల్లిక్ నాయుడు



రణస్థలం: ఎన్టీఆర్ విగ్రహం వద్ద..



కవిటి: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కోటబొమ్మాళి: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



పొందూరు: రక్తదానం చేస్తున్న మండల నాయకులతో రవికుమార్



టెక్కలి: పూలమాలలు వేస్తూ..



నందిగాం: ఎన్టీఆర్ విగ్రహం వద్ద..



వజ్రపుకొత్తూరు: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



మందస: నివాళులర్పిస్తూ..



ఎల్ఎన్ పేట: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద..



కొత్తూరు: ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సోంపేట: నివాళులర్పిస్తున్న దృశ్యం



కంచిలి: మఠం కంచిలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద..

ఎన్టీఆర్‌తోనే రాజకీయ చైతన్యానికి నాంది

పాతపట్నం: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ రాజకీయ చైతన్యానికి నాంది పలికారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి గోవిందరావు అన్నారు. గురువారం పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐదు మండలాల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, ఎంజీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధి సొట్టవానిపేట సమీపాన టీజీఆర్ నగర్‌లో గురువారం సాయంత్రం స్థానికులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వైకృష్ణ సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించి, ఆరా తీశారు. సుమారు ఆరు నెలల నుంచి ఇదే ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ ఈ వ్యక్తి తిరిగేవాడని తెలిపారు. అయితే ఇటీవల కనిపించలేదని గురువారం ఉదయం మద్యం తాగి కనిపించి సాయంత్రానికి విగతజీవిగా కనిపించాడని తెలిపారు. దీనిపై ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసి వీఆర్‌వో సమక్షంలో శవపంచనామా నిర్వహించి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

భర్త వేధింపులపై మహిళ ఫిర్యాదు

సంతబొమ్మాళి: భర్త వేధింపులపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉమిలాడ గ్రామానికి చెందిన మూగి మానసను మామ పోలారావు, అత్త శకుంతల వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని భర్త పోలారావుకి చెప్పగా.. తిరిగి తననే కొట్టేవాడు. ఈనెల 14న కన్నవారింటి వద్ద ఉండగా, దౌర్జన్యంగా వచ్చి తొమ్మిది నెలల తన కుమారుడిని తీసుకువెళ్లిపోయారు. తన బాబును ఇవ్వాలని అడుగగా భర్త శివతో పాటు అత్తమామలు, ఇతర కుటుంబసభ్యులు దాడిచేసి కొట్టినట్టు సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టు చేయడంతో విషయం బయటకు వచ్చింది. దీంతో భర్త శివతో పాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే తన తండ్రి, రిటైర్డు సైనికుడు పోలారావుపై అకారణంగా పోలీసులు కొట్టారని కుమారుడు శివ ఆరోపిస్తూ దెబ్బలు తగిలిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారింది. ఎస్ఐ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిపై పోలారావు దురుసుగా ప్రవర్తించడంతో పాటు చేయి చేసుకున్నట్టు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణం

అరసవిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలోను, రాష్ట్రంలోను విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణరావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తెగా రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు చేపట్టనున్న షర్మిల ప్రమాణ స్వీకారోత్సవానికి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమై పోయిందని, జాబ్ క్యాలెండర్ లేదని, యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కేవీఎల్ ఈశ్వరిని, జిల్లా మత్స్యకార సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన పి.రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో రైల్వే మాజీ సలహాదారుడు మంత్రి నర్సింహమూర్తి, జీపీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు ధరించాలి



మాస్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: ప్రతీ ఒక్కరూ మాస్క్ ధరించి సిక్కోలును కరోనా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. కరోనా మూడో దశ వ్యాప్తి వేగవంతమైన తరుణంలో వివిధ సామాజిక సేవా సంస్థలతో కలిసి గురువారం పాతబస్టాండ్ ప్రాంతంలో వెయ్యి మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాగ్రహీత నవజీవనరావు, లైన్స్‌క్లబ్ సెంట్రల్ ట్రెజరర్ శిల్లా మణికంఠ, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వెంకటలక్ష్మి, హటకేసరి, చరణ్, సూర్యప్రకాష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

కలెక్టరేట్: ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని గురువారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కుల కోసం, జాతి అభ్యున్నతి కోసం పాటుపడిన మహామనిషి అంబేడ్కర్ అని కొనియాడారు. శుక్రవారం ఉదయం సామాజిక సమతా సంకల్ప ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రతీ ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ గొప్పదనాన్ని తెలిసేలా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ విశ్వమోహన్‌రెడ్డి, డీఐపీఆర్వో కె.చెన్నకేశవరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, డ్వామా పీడీ చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ కూడలిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం



నినాదాలు చేస్తున్న బెంతు ఒరియా కులస్థులు

కవిటి/ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని బెంతు ఒరియా సంఘ నాయకులు అన్నారు. కుల ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం కవిటిలో బైక్ ర్యాలీ ప్రారంభించి, ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్ వరకు కొనసాగించారు. అక్కడ మానహారంగా ఏర్పడి ప్రభుత్వం తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని నిరసన తెలిపి, వినితి పత్రాలు అందించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి శివ బిసాయి, ఉపాధ్యక్షుడు మోహన్ సాహు, సంఘ ప్రతినిధులు సుమన్ బిసాయి, దుదిష్టి మజ్జి, బృందావన్ దొళాయి, మేఘనాథ్ బిసాయి, రజనీకుమార్ దొళై తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐ సిబ్బందితో చేరుకుని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్

శ్రీకాకుళం క్రైం: వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా గురువారం నగరంలో ట్రిపుల్ రైడింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎం.హరికృష్ణ సుమారు 100 మందిని ట్రిపుల్ రైడింగ్‌లో పట్టుకున్నారు. వీరందరికి ఏడురోడ్ల కూడలిలో ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణ, హెల్మెట్ ఆవశ్యకత తదితర అంశాలపై డీఎస్పీ అవగాహన కల్పించి మాట్లాడారు. ఇక పై ట్రిపుల్ రైడింగ్‌తో పాటు లైసెన్స్‌లు లేకుండా మైనర్లు దొరికితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ హరికృష్ణ, హెచ్‌సీ ఉమామహేశ్వరరావు, పీసీలు భాస్కరరావు, సింహాచలం, ఈశ్వరరావు, చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని తుమ్మవీధి, కత్తిరివీధిలోని యువతకు రోడ్డు భద్రతపై టూటౌన్ ఎస్ఐ లక్ష్మణరావు అవగాహన కల్పించారు.

నడిరోడ్డుపై హత్యాయత్నం

- సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిపై ఆటో డ్రైవర్ దాడి
- రక్తపు గాయాలతో పరుగులు పెట్టిన బాధితుడు



చికిత్స పొందుతున్న సోమేష్

శ్రీకాకుళం క్రైం: నడిరోడ్డుపై ఓ వ్యక్తిని ఓ ఆటో డ్రైవర్.. నికెల్ చెస్ట్ (చేతికి తొడిగే ఐరన్ ఆయుధం)తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన నగరంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని చిన్నబజారు సమీపంలో రాజకట్ల వీధిలో నివసిస్తున్న జి.సోమేష్ అనే యువకుడు ఐరన్ వర్కులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో విధులు ముగించుకుని సైకిల్‌పై రైతు బజారు సమీపంలోని మీసేవా కేంద్రం వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆటోలో వచ్చి నికెల్ చెస్ట్ చేతికి తొడిగి దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తగాయాలైన సోమేష్ కాపాడండంటూ కేకలు వేస్తూ రోడ్డుపై పరుగులు పెట్టాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న స్థానికులు ఇది గమనించి సోమేష్‌ను కాపాడేందుకు ప్రయత్నించడంతో దాడి చేసిన డ్రైవర్ వచ్చిన ఆటోలోనే పరారయ్యాడు. తీవ్ర రక్తగాయాలతో రోడ్డుపై పడివున్న సోమేష్‌ను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తొలుత అతడి వివరాలు చెప్పిన సోమేష్.. అపస్మారక స్థితికి చేరుకోవడంతో తాను ఎక్కడున్నాను.. ఏమి జరిగింది అంటూ మాట్లాడుతుండడాన్ని వైద్య సిబ్బంది గుర్తించారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని భోరున విలపించారు. అయితే ఘటనా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉండడంతో దాడి చేసింది ఎవరన్నది తెలుసుకునే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. ఇదిలావుండగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రౌడీ షీటర్లను, అనుమానిత వ్యక్తులపై సరైన నిఘా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో గల సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం డిసెంబరు నెల నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్రమ మద్యం, నగదు తరలింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని తనిఖీలు చేయాలన్నారు. సెబ్ అధికారులతో సంయుక్తంగా క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు డి.బాలచంద్ర రెడ్డి, వై.శ్రుతి, నాగేశ్వర రెడ్డి, ఎస్.వాసుదేవ్, సీహెచ్‌జీవీ ప్రసాద్‌రావు, విజయకుమార్, సీఐలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆమదాలవలస: దూసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. సమావేశంలో 1991-92 టెన్త్ చదువుకున్న విద్యార్థులు పాల్గొని ఆనాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పైడి సత్యనారాయణ, ఎస్వీ రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: ఆనందపురంలోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నుంచి ఎనిమిది రోజులపాటు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా హోమాలు, సాయి సత్య వ్రతాలు, అభిషేకాలు, సత్సంగం, భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. ఆలయం ప్రాంగణంలో నిర్మించిన 46 అడుగుల నాగసాయి, 100 అడుగుల మహాస్తూపం వార్షికోత్సవాలు ఈ సందర్భంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

డీసీసీబీ మెంబర్ల పదవీ కాలం పొడిగింపు

శ్రీకాకుళం క్రైం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బోర్డు మెంబర్ల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీసీసీబీ సీఈవో వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాల బోర్డు మెంబర్లకు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు బోర్డులో ఉన్న ఏడుగురు సభ్యులకు ఈ నెల 18వ తేదీ నుంచి జూలై 17 వరకు కాలపరిమితి పెరిగిందన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

జి.సిగడాం: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో కె.నిశ్చల అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జీపీడీపీ ప్రణాళిక శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

జి.సిగడాం: అర్హులకు సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం సంతవురిటిలో సచివాలయ భవనాన్ని, గెడ్డకంచరాంలో ఆర్బీకేను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బూడారి లక్ష్మణరావు, ఎంపీపీ మీసాల సత్యవతి, జడ్పీటీసీ కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించాలి

ఇచ్ఛాపురం రూరల్: జాబు కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ 100 రోజులు పని కల్పించాలని ఏపీవో పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉపాధి కార్యాలయంలో క్షేత్రసహాయకులతో సమావేశం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించాలని సూచించారు.

జిల్లాలో 23,948 మందికి లబ్ధి

కలెక్టరేట్: ఇళ్లు నిర్మిస్తున్న జిల్లాలోని 23,948 మందికి రూ.2.57కోట్లు లబ్ధి చేకూరిందని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఇంటి లోన్లకు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ముఖ్యమంత్రి బటన్ నొక్కి ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ పీడీ గణపతిరావు, ఈఈ పి.రఘురాం, డిప్యూటీ ఈఈలు కె.అప్పారావు, జి.రమణమూర్తి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పై దృష్టి సారించాలి

లావేరు: గ్రామాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు దృషి సారించాలని ఎంపీడీవో కె.సురేష్ కుమార్ కోరారు. జీపీడీపీ, బీపీడీపీపై నిర్వహిస్తున్న శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈనెల 19 నుంచి నిర్వహించనున్న కులగణన విజయవంతం చేయాలని కోరారు.

- **ఇచ్ఛాపురం రూరల్:** పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో గుర్తించిన పనులు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాయలంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలులో అవకతవకలను అరికట్టాలి

అరసవల్లి: ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అవకతవకలను అరికట్టి రవాణా చార్జీలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో కమిటీ సమావేశం పి.చంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ.. మిల్లర్లు 80 కిలోల బస్తా ధాన్యానికి అదనం మరో రెండు నుంచి ఐదు కిలోల వరకు తీసుకుంటున్నారన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని పది నెలలుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా పొందూరు చంద్రరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘ ఉపాధ్యక్షుడు కె.కొండయ్య, బగాది వాసుదేవరావు, కె.పుణ్యవతి, తోణంగి నందివాడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యాయానికి నాంది

శ్రీకాకుళం క్రైం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ దేశ చరిత్రలో మరో నూతన అధ్యాయానికి నాందిపలికినట్టని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం విజయవాడలో జరగబోయే విగ్రహ ఆవిష్కరణకు అన్ని వర్గాల వారు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పూజిత అక్షింతలు పంపిణీ

బూర్జ: డొంకలపర్త పంచాయతీలో అయోధ్య రాముడి పూజిత అక్షింతలను గురువారం పంపిణీ చేశారు. జిల్లా సంస్కృతి ప్రముఖ్ జడ్డు జగ్గారావు, జిల్లా సంయోజకులు దాసరెడ్డి యోగేశ్వరరావు, ఇస్కాన్ భక్తులు గుడ్ల రామకృష్ణ, ధర్మ ప్రచారక్ కోడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా అయోధ్య రామాయలం ప్రారంభోత్సవంపై అవగాహన కల్పించారు.

యాదవులకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో యాదవ సామాజిక వర్గం అధికంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే సీట్ యాదవ కులానికి చెందిన జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుకు కేటాయించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎన్జీవో హోమ్‌లో విలేకరులతో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. జనసేన-టీడీపీ పొత్తులో భాగంగా దాసరి రాజు ఇచ్ఛాపురం టిక్కెట్ ఇవ్వాలని అన్నారు. సమావేశంలో సంఘ నాయకులు దాసరి రాము, బూర పాపారావు, ఎస్.హేమ సుందర్, పి.గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లివలసలో ఎన్ఎస్ఎస్ శిబిరం

గుజరాతీపేట: శ్రీకాకుళం మండలం పల్లివలస గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం నిర్వహించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా సామాజిక చిత్రపటం, వెన్ డయా గ్రామ్‌లను గీసి గ్రామ స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామంలో వివిధ రకాల మౌలిక సదుపాయాలు తెలుసుకోవచ్చునని కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ రామచంద్రరావు, కళాశాల వ్యవసాయ విస్తరణ విభాగ నిపుణులు చిన్నంనాయుడు, సునంద, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.